ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతిలో లోక్ భవన్, గవర్నర్ కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన నాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయి అని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు.

- మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు.

- కార్మికుల సామాజిక భద్రత కోసం నూతన కార్మిక కోడ్స్ ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మినర్సయ్య తెలిపారు.

====================

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించి దాదాపు 9,500 కోట్ల రూపాయలతో 506 ప్రాజెక్టులకు పరిపాలనపరమైన అనుమతులను మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు తెలియజేశారు. రాజధాని అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు వసతి గృహాలు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గం అంగీకారం లభించిందని ఆయన వెల్లడించారు. అలాగే సీడ్ యాక్సిస్ రహదారిని 16వ నెంబర్ జాతీయ రహదారికి అనుసంధానించే పనులకు 532 కోట్ల రూపాయల మేర టెండర్లు పిలిచేందుకు మంత్రివర్గం ఆమోదించిందని పార్థసారథి తెలియజేస్తూ...

(వాయిస్...34 సెకన్లు)

====================

దేశంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు అటల్ బిహారీ వాజ్ పేయి శ్రీకారం చుట్టారని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో బిజెపి ఆధ్వర్యంలో అటల్ మోదీ సుపరిపాలన యాత్ర కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుమూల గ్రామీణ ప్రాంతాలను, పట్టణాలతో కలుపుతూ ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకాన్ని వాజ్ పేయి ప్రారంభించారని గుర్తుచేశారు. అదే విధంగా పోక్రాన్ పరీక్షలు నిర్వహించి, దేశ రక్షణ సామర్థ్యాన్ని చాటి చెప్పారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్...25 సెకన్లు)

ఈ కార్యక్రమంలో భాగంగా ధర్మవరంలోని కళాశాల సర్కిల్ లో వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని మోహన్ యాదవ్ ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ లు హాజరయ్యారు.

====================

మహిళలు, బాలికలపై వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ నూతన కార్యాలయాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీలు రవిశంకర్ అయ్యన్నార్, ఆర్కే మీనా, ఉజాలా త్రిపాఠి, అడిషనల్ డీజీ (L&O) మధుసూదన రెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్చార్జి బి. రాజకుమారి ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

====================

అమరావతిలో ఏర్పాటవుతున్న క్వాంటం వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. విద్య, వైద్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ రంగాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ దేశాల నుంచి వచ్చిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల బృందంతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. వైద్యరంగంలో నూతన ఔషధాల రూపకల్పనతో పాటు మెటీరియల్ సైన్స్ పై పరిశోధనలకు గాను గ్లోబల్ క్వాంటం బయోఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని పరిశోధకులు, విద్యావేత్తల బృందం ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపింది.

====================

విరామం

====================

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పురపాలక సంఘం చైర్ పర్సన్ గా తెలుగుదేశంపార్టీ అభ్యర్థి టి. గౌతమి విజయం సాధించారు. కళ్యాణదుర్గం పురపాలక సంఘం చైర్ పర్సన్ ఎన్నికకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 22 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఓటింగులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి. గౌతమికి 13 మంది మద్దతు తెలుపగా, వైఎస్ఆర్సీ పార్టీ అభ్యర్థి ఎం.లక్ష్మన్నకి 11 మంది మద్దతు పలికారు. దీంతో గౌతమి విజయం సాధించినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో వసంత బాబు ప్రకటించారు.

====================

కడప మేయర్ స్థానానికి నిర్వహించిన ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి పాకా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ ప్రత్యేక సమావేశాన్ని ఈరోజు నిర్వహించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా 46వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

====================

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సామాజిక భద్రతను కల్పిస్తూ నూతన కార్మిక కోడ్స్ ను అమలు చేయడం జరుగుతోందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మినర్సయ్య అన్నారు. ఈ అంశంపై ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గతంలో ఉన్న 29 చట్టాలను సవరణ చేసి నాలుగు కోడ్స్ గా అమలు చేయడం జరిగిందన్నారు. వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్య, పని గంటల పరిస్థితుల కోడ్స్ వల్ల కార్మికులకు ఎంతో ఉపయోగముంటుందని లక్ష్మి నర్సయ్య పేర్కొంటూ...

(వాయిస్...25 సెకన్లు)

====================

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ భవనాన్ని ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద సుమారు ఒక కోటి 67 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు.

====================

లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ లో పిసి & పి ఎన్ డి టి జిల్లా స్థాయి అప్రూవింగ్ అథారిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వాసుపత్రులలో ఎక్కువ శాతం సాధారణ కాన్పులు జరగాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని స్పష్టం చేశారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ఐటీ సంస్థలకు సంబంధించి భూమి పూజ చేయనున్నారు. అనంతరం విశాఖ ఎకనామిక్ రీజియన్ పై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

=====================

రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు, రాయలసీమ జిల్లాలలో రానున్న మూడు రోజులలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు.

=====================

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య టి-20 క్రికెట్ మ్యాచ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. 5 మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా రెండవ టి-20 క్రికెట్ మ్యాచ్ చండీఘర్ ముల్లాన్ పూర్ లోని మహారాజా యద్వింద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగనుంది.

=====================

విశాఖ నగరంలో కొలువు తీరిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా మూడవ గురువారం అయిన ఈరోజు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశాయి. అదే విధంగా విశాఖ జిల్లా సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి చందన దీక్షలు ప్రారంభమయ్యాయి.

=====================
=====================